సాక్షి
ఒడిశా

ఆదివారం । 18 । జూన్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలక వర్గం శనివారం లెక్కించారు. ఇందులో నగదు రూ. 54,965 వచ్చాయని అధికారులు తెలిపారు.



బల ప్రదర్శనతో సీఎంకు కృతజ్ఞతలు

- ఆదివాసీ సురక్ష కల్యాణ సమితి

- 8లో



లింగ నిర్ధారణ నేరం

- 8లో

న్యూస్‌రీల్

ల్యాప్‌టాప్‌ల పంపిణీ



దివ్యాంగ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను అందిస్తున్న కలెక్టర్ సింగ్

రాయగడ: ఇద్దరు దివ్యాంగ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్ శనివారం పంపిణీ చేశారు. జిల్లాలోని గుణుపూర్ ఉన్న మహర్షి గురుకుల కళాశాలలో ప్లస్ త్రీ చదువుతున్న భాగ్యశ్రీ సాహు, రాయగడ అటానమస్ కళాశాలలో ప్లస్–త్రీ చదువుతున్న ఓం శుభం బెహరలకు వీటిని పంపిణీ చేశారు. ప్రతీ ఏడాది ఇద్దరేసి దివ్యాంగ విద్యార్థులకు ఇటువంటి తరహా సహాయాన్ని జిల్లా యంత్రాంగం అందిస్తుందని, అందుకు యంత్రాంగానికి జిల్లా దివ్యాంగుల సంఘం కార్యదర్శి అమర్ నాథ్ ధన్యవాదాలు తెలియజేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా సామాజిక సంక్షేమ శాఖ అధికారి సురేంద్ర గొమాంగొ తదితరులు పాల్గొన్నారు.
తెలిపాయి.

మరొకరు మృతి

- రైలు ప్రమాదంలో 291కి చేరిన మృతుల సంఖ్య

భువనేశ్వర్: బాలేశ్వర్ జిల్లా బహనాగా రైల్వే ప్రమాదంలో మృతుల సంఖ్య పెరుగుతోంది. కటక్ ఎస్సీబీ వైద్య కళాశాల ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరో బాధితుడు శనివారం ఉదయం మృతి చెందాడు. మృతుడు పశ్చిమ బెంగాల్‌కు చెందిన సహీల్ మన్సూర్‌గా పేర్కొన్నారు. ఈయన బహనాగా వద్ద కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రైలు దుర్ఘటనలో ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం కటక్ ఎస్సీబీ వైద్య కళాశాల ఆస్పత్రిలో చేర్చారు. ట్రామా ఐసీయూ వార్డులో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచాడు. సహీల్ మన్సూర్ మరణంతో బహనాగా రైలు ప్రమాదంలో మరణించిన వారి సంఖ్య 291కు పెరిగింది. అలాగే ఈనెల 13వ తేదీన ఒకరు, 16న మరొకరు కటక్ ఎస్సీబీ వైద్య కళాశాల ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించిన విషయం తెలిసిందే. మృతులిద్దరూ బీహార్‌కు చెందిన విజయ్ పాశ్వాన్, ప్రకాష్ రామ్ అని రిజిస్ట్రార్ డాక్టర్ అవినాష్ రౌత్ తెలియజేశారు. భారీ విషాదంలో గాయపడిన మొత్తం 46 మంది ప్రయాణికులు ప్రస్తుతం ఎస్సీబీ మెడికల్ కాలేజీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. వీరిలో 13 మంది ఐసీయూలో ఉండగా, 33 మంది జనరల్ వార్డులో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం సెంట్రల్ ఐసీయూలో ఒకరు, న్యూరో ఐసీయూలో ఉన్న మరో ఇద్దరు రోగుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఎస్సీబీ మెడికల్ కాలేజీ హాస్పిటల్ అధికార వర్గాల నుంచి సమాచారం అందుతోంది.

ద్విచక్ర వాహనానికి ఢీకొన్న ట్యాంకర్


- ఇద్దరు వ్యక్తుల మృతి



ప్రమాదంలో కాలిపోయిన ట్యాంకర్

రాయగడ: అల్యూమినా పౌడర్ లోడ్‌తో జిల్లాలోని టికిరి వైపు వెళ్తున్న ఒక ట్యాంకర్ అదుపుతప్పి, ఎదురుగా వెళ్తున్న ద్విచక్ర వాహనానికి ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే.. శనివారం రాత్రి టికిరి సమితి శంకరడ గ్రామ సమీపంలో ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తులు డెంగాగుడ గ్రామానికి చెందిన మహేశ్వర్ మాఝి(29), శంకరడ పంచాయతీలోని కుఫాకొల్ గ్రామానికి చెందిన ఒడియా మాఝిలుగా గుర్తించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పట్టాలు తప్పిన గూడ్స్ ట్రైన్



పట్టాలు తప్పిన భోగీలు

రాయగడ: జిల్లాలోని అంబొదల రైల్వేస్టేషన్ సమీపంలో ఒక గూడ్స్ ట్రైన్ శనివారం పట్టాలు తప్పింది. విశాఖపట్నం నుంచి లంజిఘడ్‌లోని వేదంతా కర్మాగారానికి బాక్సైట్ లోడ్‌తో వెళ్తున్న ట్రైన్ నాలుగు భోగీలు పట్టాలు తప్పాయి. అయితే ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదని రైల్వే వర్గాలు తెలియజేశాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ లైనులో అదనంగా మరో నాలుగు ట్రాక్‌లు ఉండడంతో రైళ్ల రాకపోకలకు ఎటువంటి ఇబ్బంది కలగలేదని పేర్కొన్నారు. అనంతరం రిలీఫ్ ట్రైన్ అక్కడకు చేరుకుని భోగీలను సరిచేసి యథావిధిగా కొనసాగించాయి.

నవ యవ్వన దర్శనం రేపు

- నేడు టికెట్ల పంపిణీ
- పటిష్టంగా భద్రతా ఏర్పాట్లు
- భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

భువనేశ్వర్: శ్రీజగన్నాథుని రథయాత్రలో నవ యవ్వన అలంకార దర్శనం అత్యంత ప్రాధాన్యమైనది. జ్యేష్ఠ పూర్ణిమ పురస్కరించుకుని భారీ స్నానం ఆచరించడంతో రత్న వేదికపై కొలువు దీరి, నిత్యం దర్శనం ఇచ్చే మూల విరాటుల ముఖ తేజస్సు మసక బారుతుంది. పక్షం రోజుల తర్వాత పూర్వశోభతో స్వామివారి తొలి దర్శనం నవ యవ్వన అలంకార దర్శనంలో భక్తులకు ప్రాప్తిస్తుంది. ఈ ఏడాది రథ యాత్ర ముందురోజు 19వ తేదీన ఈ దర్శనానికి ఏర్పాట్లు ముమ్మురంగా చేస్తున్నారు.

పరమాణిక్ టికెట్లు

నవ యవ్వన పరమాణిక్(ఆర్జిత) దర్శనం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దీనికోసం ఆదివారం ఉదయం 8 గంటల నుంచి ఒక రోజు ముందుగా పూరీ టౌన్ ఠాణా దరి నీలాద్రి భక్తి నివాస్ ప్రాంగణంలో టికెట్ల విక్రయం ప్రారంభం అవుతుందని ప్రకటించారు. నవ యవ్వన పరమాణిక్ దర్శనం టికెట్లు ఈ ప్రాంగణంలో లభిస్తాయి. టికెట్ ధర రూ.100గా ప్రకటించారు.



ఎస్‌ఓపీ సంచిక ఆవిష్కరిస్తున్న పోలీసు ఉన్నతాధికారులు

గంట మాత్రమే దర్శనం

ఈనెల 19వ తేదీ ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు ఒక గంట మాత్రమే నవ యవ్వన పరమాణిక్ దర్శనం కోసం అనుమతిస్తారు. తదుపరి సర్వ దర్శనం ప్రారంభమవుతుందని శ్రీమందిరం అధికార వర్గాలు తెలిపాయి.

ఆలయం లోపల ప్రత్యేక ఏర్పాట్లు

నవ యవ్వన దర్శనంలో భాగంగా ఆలయం లోపల గణనీయంగా రద్దీ పెరుగుతుంది. ఈ ప్రాంగణంలో పోలీసు అధికారులు ప్రత్యక్షంగా రద్దీ నియంత్రణ కార్యకలాపాలు పర్యవేక్షిస్తారు. అదేవిధంగా ఆలయం వెలుపల రద్దీ నియంత్రించడానికి సీనియర్ పోలీసు అధికారులను నియమించినట్లు తెలిపారు. శ్రీమందిరం నలువైపులా మూడంచెల భద్రతా వలయంలో అనుబంధ యంత్రాంగం పని చేస్తుంది. తొలి అంచెలో సాధారణ కలప బారికేడ్, రెండో అంచెలో పోలీసు అధికారుల పర్యవేక్షణలో తాళ్లతో బారికేడ్, మూడో అంచెలో స్టీల్ బారికేడ్ రద్దీ నియంత్రణకు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పాటు సోషల్ మీడియా, మాస్ మీడియా ద్వారా ట్రాఫిక్ వ్యవస్థ సంబంధిత సమాచారం ప్రసారం చేస్తారు.

ఎస్‌ఓపీ ఆవిష్కరణ

పూరీ టౌన్ పోలీసుస్టేషన్‌లోని ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ (ఐసీఆర్)లో రథయాత్ర– 2023 కోసం ప్రామాణిక నిర్వహణ విధానం (ఎస్‌ఓపీ) సంచిక ఆవిష్కరించారు. దీని ప్రకారం మాక్ డ్రిల్ నిర్వహించారు. ఒడిశా స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ సహకారంతో పూరీ కలెక్టర్ సమర్థ్ వర్మ, పోలీసు సూపరింటెండెంట్ డాక్టర్ కన్వర్ విశాల్ సింగ్ తదితర అధికారుల సమక్షంలో మాక్ డ్రిల్ జరిగింది. యాత్ర పురస్కరించుకుని శ్రీమందిరం సింహద్వారం నుంచి గుండిచా ఆలయం వరకు భక్తుల రద్దీ ఉంటుంది. రథాలు లాగే ప్రయత్నంలో తొక్కిసలాట నివారించడం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. మరో వైపు జన సంద్రంలో ఉక్కిరిబిక్కిరై సొమ్మసిల్లడం వంటి అవాంఛనీయ పరిస్థితులపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఈ నేపథ్యంలో చేపడుతున్న ఏర్పాట్లను సెంట్రల్ ఐజీతో కలిసి పూరీ ఎస్పీ సమీక్షించారు. సెంట్రల్ ఐజీ ఆశిష్ సింగ్, పూరీ ఎస్పీ డాక్టర్ కన్వర్ విశాల్ సింగ్ సీనియర్ పోలీసు అధికారులతో కలిసి సమీక్షించారు.



పోలీసు బలగాలకు మాక్‌డ్రిల్ విధానాలు వివరిస్తున్న ఉన్నతాధికారులు

రథాల మలుపు కీలకం

యాత్ర కోసం నిర్మాణ ప్రాంగణంలో 3 రథాలు సిద్ధం అవుతున్నాయి. యాత్ర ముందు రోజు నాటికి ఈ రథాలను శ్రీమందిరం సింహద్వారం ఆవరణకు తరలించి మూల విరాటుల ఆగమనం కోసం సిద్ధం చేయాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా నిర్మాణ ప్రాంగణం నుంచి రథాలను మలుపు తిప్పడం అత్యంత కీలకం. ఈ దిశలో అనుబంధ వర్గాలకు ముందస్తుగా ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేశారు. రథాలకు 2 అంచెల్లో భద్రత వలయం ఏర్పాటు చేస్తారు. లోపలి కార్డన్, బాహ్య కార్డన్‌గా పేర్కొంటారు. ఈ సమగ్ర వ్యవస్థ నిర్వహణపై అనుబంధ వర్గాలకు అంచెలంచెలుగా మాక్ డ్రిల్ ద్వారా శిక్షణ కల్పిస్తున్నారు. యాత్ర ఆద్యంతాలు శాంతియుతంగా నిర్వహించేందుకు సమగ్రంగా 160 ప్లాటూన్ పోలీసులను మోహరించేందుకు సన్నద్ధత వ్యక్తం చేశారు. శ్రీ మందిరం, గుండిచా దేవాలయం, తదితర ప్రాంతాల్లో 50కి పైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు.

గ్రీన్ కారిడార్ ఏర్పాటు

రథయాత్ర, బహుడా (మారు రథ యాత్ర) సందర్భంగా రథాలు లాగే సమయంలో తొక్కిసలాట నివారణతో ఊపిరాడక సొమ్మసిల్లే విపత్కర పరిస్థితుల్ని సమర్థంగా నిర్వహించేందుకు యాత్ర ప్రాంగణంలో ప్రత్యేకంగా గ్రీన్ కారిడార్ ఏర్పాటు చేస్తున్నారు. రద్దీలో సొమ్మసిల్లిన వారికి తక్షణ వైద్యం అందించడానికి గ్రీన్ కారిడార్ దోహదపడుతుంది. ఈ చర్యల కోసం ప్రత్యేక వాలంటీర్లు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటారు. క్షతగాత్రులను స్ట్రెచర్లపై అంబులెన్స్‌కు తీసుకొచ్చి పూరీ జిల్లా ప్రధాన ఆస్పత్రికి తక్షణమే తీసుకెళ్తారు. ఘటనా స్థలం నుంచి ఆస్పత్రి వరకు దారి పొడవునా అంబులెన్సు రవాణాకు ఎటువంటి అంతరాయం లేకుండా చేసేందుకు గ్రీన్ కారిడర్ ఏర్పాటు చేస్తున్నారు. సెయింట్ జాన్ అంబులెన్స్, రెడ్‌క్రాస్, ఆపద మిత్ర, సెయింట్ జాన్ జగన్నాథమ్ అండ్ హ్యాపీనెస్ ఫౌండేషన్ డివిజన్, నేషనల్ సెల్ఫ్ ఎంప్లాయిడ్ యూనియన్, స్కౌట్ అండ్ గైడ్, రోవర్ మరియు రేంజర్‌లు గ్రీన్ కారిడార్ ద్వారా అంబులెన్సు రవాణా పర్యవేక్షిస్తారు.



యాత్రలో శాంతిభద్రతల పరిరక్షణకు సిద్ధమైన పోలీసు దళాలు

ఆలయానికి మూడంచెల భద్రత

15 రోజుల తర్వాత స్వామివారు భక్తులకు యవ్వన సౌందర్యంతో దర్శనమివ్వనున్నాడు. ఈ నేపథ్యంలో భక్తుల తాకిడిని దృష్టిలో పెట్టుకొని శ్రీమందిరానికి మూడంచెల భద్రత వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నట్లు పూరీ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ డాక్టర్ కన్వర్ విశాల్ సింగ్ తెలిపారు. నవ యౌవన దర్శనం కోసం విచ్చేసే భక్తుల రద్దీ నియంత్రణకు 70 ప్లాటూన్ల పోలీసు బలగాలను మోహరిస్తున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు వాహనాల రవాణా నియంత్రణకు చర్యలు చేపడుతున్నారు. ఈ కార్యకలాపాల కోసం 25 ప్లాటూన్ల పోలీసు బలగాలను రంగంలోకి దింపుతున్నారు.

జగన్నాథునికి కానుక



గీత గోవింద నామావళి పట్టు వస్త్రం కానుకగా అందజేస్తున్న దృశ్యం

భువనేశ్వర్: పూరీలోని ప్రపంచ ప్రసిద్ధి చెందిన గుండిచా యాత్రలో పాల్గొంటున్న శ్రీజగన్నాథునికి ఒక భక్తుడు పవిత్ర గీత గోవింద నామావళితో నేసిన పట్టు వస్త్రం కానుకగా సమర్పించాడు. కటక్ జిల్లా తిగిరియా మండలం హరిహరపురపట్న ప్రాంతం నుపట్న నివాసి శరత్ కుమార్ కుండొ దీనిని సమర్పించాడు. ప్రముఖ హస్తకళా గ్రామంగా పేరొందిన నుపట్నాలో ఉంటున్న శరత్ కుటుంబంలో ఇంటిల్లపాది 6 నెలల పాటు నిరవధికంగా శ్రమించి అత్యంత భక్తిశ్రద్ధలతో ఈ వస్త్రం సిద్ధం చేయడం విశేషం. స్వామి కోసం ప్రత్యేక వస్త్రం పనుల ప్రారంభం నుంచి నిత్యం ఒంటి పూట భోజనం ఇతరేతర నియమ నిష్ఠలను కట్టుదిట్టంగా ఇంటిల్లపాది ఆచరించడంతో ఈ పని విజయవంతంగా పూర్తి అవుతుందని వీరి నమ్మకం. తరతరాలుగా రథ యాత్ర పురస్కరించుకుని శరత్ కుటుంబం శ్రీమందిరం పాలన యంత్రాంగానికి గీత గోవింద నామావళి వస్త్రం కానుకగా సమర్పిస్తున్నట్లు వివరించారు. శరత్ తండ్రి, తాత కాలం నుంచి ఈ సేవ నిరవధికంగా కొనసాగుతుందన్నారు.

విద్యుత్ కోతలకు వ్యతిరేకంగా ఆందోళన



ఆందోళనకారులను తీసుకెళ్తున్న పోలీసులు

భువనేశ్వర్: రాష్ట్రవ్యాప్తంగా నిరంతర విద్యుత్ కోతలకు వ్యతిరేకంగా నవ నిర్మాణ్ యువ ఛత్ర సంఘటన్ కార్యకర్తలు ఆందోళనకు నడుం బిగించారు. ఈ సందర్భంగా శనివారం ఘెరావ్ చేశారు. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి ప్రతాప్ కేశరీ దేవ్ నివాసాన్ని ఆందోళనకారులు ముట్టడించేందుకు విఫలయత్నం చేశారు. ప్రజలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడంలో విఫలమయ్యారని ఆరోపిస్తూ, పెద్ద సంఖ్యలో నవ నిర్మాణ్ యువ ఛత్ర సంఘటన్ కార్యకర్తలు మంత్రి నివాసం వెలుపల భారీ ప్రదర్శన నిర్వహించారు. నిరంతర విద్యుత్ కోతపై ఆందోళనకారుల నినాదాలతో పరిసరాలు మారుమోగాయి. ఒడిశా విద్యుత్ మిగులు రాష్ట్రమైనప్పటికీ, తరచు విద్యుత్ కోతతో రాష్ట్ర ప్రజలు వర్ణనాతీతమైన ఇబ్బందుల్ని ఎదుర్కోవడం అత్యంత విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విద్యుత్ పంపిణీ, సరఫరా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, వడగాడ్పులు, ఉక్కపోత వంటి వాతావరణ వైపరీత్యాల మధ్య విద్యుత్ కోత భరించడం సాధ్యం కావడం లేదన్నారు. విద్యుత్ కోతతో ఇంటా బయట ఉండలేని దయనీయ పరిస్థితుల మధ్య రాష్ట్ర ప్రజలు కొట్టుమిట్టాడుతున్నారని ఆందోళనకారులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ అంతరాయానికి మంత్రి బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కరెంటు కోత లేదంటూ మంత్రి ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. విద్యుత్తు మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.20 వేల కోట్లు మంజూరు చేశారని, భువనేశ్వర్‌లో భూగర్భ కేబులింగ్ పనులకు కూడా అదనపు నిధులు మంజూరయ్యాయని ప్రదర్శనకారులు తెలిపారు. అయినా ప్రజలకు అంతరాయం లేని విద్యుత్ అందించేందుకు ఎలాంటి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రతి ఇంటికీ 200 యూనిట్ల పరిమిత ఉచిత విద్యుత్, వ్యవసాయ రంగానికి పూర్తి ఉచిత విద్యుత్ అందించాలని ప్రదర్శనకారులు డిమాండ్ చేశారు. మంత్రి నివాసం ముట్టడికి ఉద్యమించిన ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు రంగంలోకి దిగారు

చకచకా దర్జీ పనులు



నందిఘోష్ రథం వస్త్రాలంకరణ పనుల్లో దర్జీ సేవకులు



శ్రీమందిరం కార్యాలయం ప్రాంగణంలో దర్జీ సేవలు



రథ వస్త్రాలకు అదనపు హంగులు దిద్దుతున్న దర్జీ సేవకులు

- రథాల తయారీ అలంకరణలో వస్త్రాలదే పైచేయి
- విశేషంగా సేవలందిస్తున్న దర్జీలు
- 1,250 మీటర్ల వస్త్రాలు

భువనేశ్వర్: జగన్నాథుని రథయాత్రకు సమయం ఆసన్నమైంది. మూడు రథాల తయారీ పూర్తయ్యింది. అలంకరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. చక్రాల నుంచి రథ శిఖరం వరకు అలంకరణ అత్యంత ఆకర్షణీయం. అయితే రథాల అలంకరణలో వస్త్రాలదే పైచేయి. దర్జీ సేవకులు ఈ పనులు నిర్వహిస్తారు. ఈ పనులు ఆలయ కార్యాలయం ప్రాంగణంలో ప్రస్తుతం చురుగ్గా కొనసాగుతున్నాయి. అత్యంత వ్యయ ప్రయాసలతో సేకరించిన కలపతో తయారైన రథాలు కళ్లకు ఆకట్టుకున్నట్లు తీర్చి దిద్దడంలో దర్జీ సేవ కీలక పాత్ర పోషిస్తుంది. వస్త్రాలంకరణలో జరీ, జీలుగు వంటి ఇతర పదార్థాలను క్రమ పద్ధతిలో వినియోగిస్తారు. మూడు రథాల అలంకరణ కోసం సమగ్రంగా 1,250 మీటర్ల వస్త్రం వినియోగిస్తారు.

సంప్రదాయ రీతుల్లో పనులు

పవిత్రమైన దేవ స్నాన పౌర్ణమి మరుసటి రోజు ధూప, దీప, పుష్పాదులతో పూజాదికాలు నిర్వహించి దర్జీ సేవాయత్‌లు పనులకు శ్రీకారం చుడతారు. ఈ సందర్భంగా రథ అలంకరణ వస్త్రాలు లాంచనంగా కోస్తారు. తొలుత బలభద్రుడి రథం, తదుపరి శ్రీజగన్నాథుని రథం, చివరగా దేవీ సుభద్రా రథ వస్త్రాలు లాంఛనంగా కోసి దర్జీ సేవలకు శ్రీకారం చుట్టడం ఆచారం.

1,250 మీటర్ల వస్త్రం

జగన్నాథుని నందిఘోష్ రథం, బలభద్రుని తాళ ధ్వజ్ రథం అలంకరణకు 425 మీటర్ల చొప్పున మరియు సుభద్ర రథం దర్ప దళన రథం అలంకరణకు 400 మీటర్ల వస్త్రం ఉపయోగిస్తారు. ఇలా మొత్తం మీద 1250 మీటర్ల వస్త్రం ఉపయోగించబడుతుంది. సర్దార్ ప్రకాష్ మహాపాత్ర నేతృత్వంలో 18 మంది దర్జీలు రథాల వస్త్ర అలంకరణ పనుల్లో నిమగ్నమై ఉన్నారు.

ప్రత్యేక రంగుల వస్త్రాలు

శ్రీజగన్నాథుని నందిఘోష రథంలో ఎరుపు, పసుపు రంగు, బలభద్రుని తాళ ధ్వజం రథంలో ఎరుపు, ఆకుపచ్చ మరియు దేవీ సుభద్ర దర్ప దళన రథం అలంకరణలో ఎరుపు, నలుపు రంగు వస్త్రాలు ఉపయోగిస్తారు.

దేవి సుభద్ర రథం ఇరుసులో పగుళ్లు

- ప్రమాదం ఏమీ లేదు: మహరణ సేవకులు

భువనేశ్వర్: పూరీ జగన్నాథుని రథయాత్ర దగ్గర పడుతున్న తరుణంలో పలు ఉత్కంఠభరిత పరిస్థితులు చోటు చేసుకుంటున్నాయి. యాత్ర కోసం రథాల తయారీ పూర్తయ్యి, అలంకరణ దశలో తుది మెరుగులు దిద్దుకుంటున్నాయి. ఈ తరుణంలో దేవీ సుభద్ర యాత్ర కోసం తయారు చేసిన దర్పదళనం చిన్న ఇరుసు బీటలు వారినట్లు గుర్తించారు. మరో మూడు రోజుల్లో మూల విరాటులతో బొడొదండొ గుండా చకచకా కదలాల్సిన రథం ఇరుసులో బీటలు సర్వత్రా ఆందోళన కలిగించాయి. దర్ప దళనం వెనుక మరియు దిగువ ఇరుసులో పగుళ్లు కనిపించాయి. రథం యొక్క మొత్తం భారం ఈ చిన్న ఇరుసు మీద ఆధారపడి ఉంటుంది. రథం కదిలే సమయంలో ప్రమాదం సంభవిస్తుందనే సందేహం సర్వత్రా బలపడింది. అయితే ఎలాంటి ఇబ్బంది ఉండదని మహరణ సేవకులు చెబుతున్నారు. సుభద్ర రథం చిన్న ఇరుసులో పగుళ్లు గందరగోళ పరిస్థితిని ప్రేరేపించాయి. శనివారం ఉదయం రథాన్ని తనిఖీ చేస్తున్న సమయంలో పగుళ్లు గుర్తించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. పగుళ్లను గుర్తించిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. లోపం సవరించేందుకు మహరణ సేవకులు సత్వర చర్యలు చేపట్టాలని ప్రతిపాదించారు. ఈనెల 20న జరగనున్న రథయాత్ర సందర్భంగా రథాలు లాగే సమయంలో దీనివలన ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందనే భయాందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ఈ పరిస్థితిపై పూరీ జిల్లా యంత్రాంగం, ఆలయ అధికారులు ప్రత్యక్షంగా రంగంలోకి దిగి పరిస్థితిని విశ్లేషించారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా రథాలు సజావుగా లాగేందుకు అనుకూల చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.



బీటలువారిన దేవీ సుభద్ర రథం ఇరుసు

ఇరుసు మార్పు అవసరం లేదు: తనిఖీ కమిటీ

బీటలు వారిన దేవీ సుభద్ర దర్ప దళన రథం ఇరుసు మార్చాల్సిన అవసరం లేదని, ఈ మేరకు ఆలయ పాలకమండలి కీలక సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. రథ నిర్మాణ కమిటీ పరిశీలన పరిగణనలోకి తీసుకుని ఈ మేరకు నిర్ణయించినట్లు ప్రకటించారు. బీటలు వారిన ప్రాంతంలో యూ–క్లాంప్ అమర్చి రథం యథాతథంగా లాగేందుకు వీలవుతుందని రథ నిర్మాణ పరిశీలన కమిటీ పేర్కొంది. శ్రీజగన్నాథ ఆలయ కార్యాలయంలో ప్రధాన కార్యనిర్వహణాధికారి (సీఏఓ) రంజన్‌కుమార్ దాస్ అధ్యక్షతన శనివారం రథ నిర్మాణ కమిటీ సమావేశం జరిగింది. దర్ప దళనం యొక్క చిన్న ఇరుసును మార్చాలా వద్దా అనే చర్చ జరిగింది. అయితే ఈ రథం ఇరుసు మార్చాల్సిన అవసరం లేదని నిపుణులు తేల్చిచెప్పారు. రథం వెనుక మరియు దిగువ ఇరుసులో పగుళ్లు కనుగొన్నారు. రథం కదిలే సమయంలో ప్రమాదం నివారణకు ఇనుప బిగింపుల ద్వారా సుసాధ్యమని తనిఖీ కమిటీ బృందం నిర్ధారించింది.

బల ప్రదర్శనతో సీఎంకు కృతజ్ఞతలు



సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన నేతలు

• ఆదివాసీ సురక్ష కల్యాణ సమితి

కొరాపుట్: బల ప్రదర్శన ద్వారా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తామని ఆదివాసీ సురక్ష కల్యాణ సమితి ప్రకటించింది. శనివారం నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని చమిరియా గుడలో ఉన్న బినోద్ ప్యాలస్‌లో జరిగిన మీడియా సమావేశంలో గిరిజన నేతలు ప్రసంగించారు. దేశంలోని ఏరాష్ట్రంలోనూ లేనివిధంగా మన రాష్ట్రంలో గిరిజనుల అభివృద్ధికి సాంతంత్ర్య అభివృద్ధి మండలిని ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. నబరంగ్‌పూర్ మాజీ ఎంపీ ప్రదీప్ మజ్జికి కేబినేట్ హోదా ఇచ్చిందన్నారు. ఈ సంస్థకి ప్రత్యేకంగా రూ.400 కోట్లు ఇవ్వడం హర్షణీయమని పేర్కొన్నారు. అదివారం గిరిజనుల కోసం రు.16.5 కోట్ల అభివృద్ధికి పనులకు శంకుస్థాపనలు జరుగుతాయని పేర్కొన్నారు. దీనిలో భాగంగా స్థానికంగా రూ.5 కోట్లతో గిరిజన సాంస్కృతిక ఆడిటోరియం నిర్మాణం జరగనుందని పేర్కొన్నారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి జగన్నాథ సరక శంకుస్థాపన చేస్తారన్నారు. సమావేశంలో అఖిల్‌బోత్ర, గోపినాథ్ మజ్జి, జడేశ్వర్ జానీ, జగన్నాథ సౌర తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు మంత్రి సరక

13 గిరిజన తెగలు నిర్వహించే భారీ ర్యాలీకి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక హాజరవ్వనున్నారు. దీనిలో భాగంగా ఆదివారం ఉదయం ప్రత్యేక హెలికాప్టర్‌లో నబరంగ్‌పూర్ ఎంపీ రమేష్ చంద్ర మజ్జితో కలసి రానున్నారు. ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే శంకుస్థాపనలు చేయనున్నారు. గిరిజనుల ఇచ్చే కృతజ్ఞత ర్యాలీని ఉద్దేశించి ప్రసంగించనున్నారు.

క్లుప్తంగా

బొగ్గు వ్యాగన్‌లో మంటలు



బొగ్గు వ్యాగన్‌లో మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక దళం

భువనేశ్వర్: బొగ్గు రవాణా చేస్తున్న గూడ్స్ రైలు వ్యాగనులో మంటలు చెలరేగాయి. ఢెంకనాల్ జిల్లాలో శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. అంగుల్–సుకింద రైలు మార్గంలో బొగ్గు లోడుతో తాల్చేర్ నుంచి డుబురికి వెళ్తున్న గూడ్స్ వ్యాగన్లలో పొగలు కమ్ముకున్నాయి. కామాఖ్యనగర్ పోలీసుస్టేషన్ పరిధిలోని రంగ్‌మటియా స్టేషన్‌కు రైలు చేరుకునే సరికి 57వ నంబర్ వ్యాగన్ మంటలు చెలరేగాయి. పరిస్థితి పసిగట్టిన లోకో పైలట్ స్టేషన్ అధికారులకు సమాచారం ఆందజేయడంతో స్థానిక అగ్నిమాపక దళం ఘటనా స్థలం సందర్శించి మంటలు నివారించింది. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి హాని సంభవించక పోవడంతో రైల్వే యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



దెబ్బతిన ట్రక్ ముందర భాగం

బరంపురం: నగరానికి సమీపంలోని సంత దగ్గర శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందారు. ఎదురెదురుగా వస్తున్న ట్రక్, వ్యాన్ ఢీకొనడంతో క్లీనర్ మృతి చెందగా, డ్రైవర్‌కి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న గోళంతరా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్లీనర్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే గాయాలతో ఉన్న డ్రైవర్‌ని రక్షించి ఎంకేసీజీ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పైడితల్లిఆలయ విస్తరణకు లైన్ క్లియర్



షాపుల వర్తకులకు బకాయిల చెక్కును అందజేస్తున్న ఈఓ సుధారాణి

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారి చదురుగుడి విస్తరణకు లైన్ క్లియర్ అయిందని ఆలయ ఈఓ కె.ఎల్.సుధారాణి తెలిపారు. ఆలయానికి ఇరువైపులా ఉన్న నాలుగుషాపుల యజమానులకు పూర్తిస్థాయిలో బకాయిలు చెల్లించామన్నారు. ఆలయ ఆవరణలో షాపుల వర్తకులకు శనివారం రూ.25లక్షల36వేల311ల విలువైన చెక్కును ట్రస్ట్ బోర్డు ప్రతినిధుల చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు బోర్డు ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీఐ ప్రవేశాలకు 192 మంది ఎంపిక



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

విజయనగరం రూరల్: జిల్లాలోని పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లలో ప్రవేశాలకు నాలుగోరోజు శనివారం కౌన్సెలింగ్ సాగింది. 192 మందికి ప్రవేశాలు కల్పించినట్టు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ టీవీ గిరి తెలిపారు.

మట్టి పరీక్షలే పంటకు మూలం



మిందివలస గ్రామంలో మట్టి నమూనాలు తీయిస్తున్న జేడీ రామారావు

శృంగవరపుకోట: వ్యవసాయంలో మట్టి నమూనాలు చాలా కీలకమైనవి.. మట్టి సారం, పోషకాల శాతం, ఎటువంటి పంటలు పండించాలి.. ఎరువులు ఎంత మోతాదులో వేయాలి అన్న ప్రతి అంశం తెలుస్తుందని జిల్లా వ్యవసాయాధికారి వి.టి.రామారావు తెలిపారు. కొత్తవలస మండలం మిందివలస గ్రామంలో ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం కిసాన్) ఈకేవైసీ, మట్టి నమూనాలు అంశాలపై క్షేత్రస్థాయిలో వ్యవసాయశాఖ ఉద్యోగుల పనితీరును శనివారం సమీక్షించారు. ఏడీ ఎల్.విజయ, ఏఓ మాధురితో కలిసి రైతులతో మాట్లాడారు. పీఎం కిసాన్ రాని రైతులు ఈకేవైసీ చేయించుకోవాలని, ప్రతి రైతు మట్టి నమూనాలు సేకరించి పరీక్షలు చేయించుకోవాలని, నేలలో ఉన్న పోషకాలను బట్టి ఎరువుల యాజమాన్యం, పురుగు మందుల యాజమాన్యం నిర్వహించి దిగుబడులు సాధించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 33వేల మట్టి నమూనాలు సేకరించడం లక్ష్యంగా నిర్ణయించామని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ గణేష్, హెచ్.ఎ.దుర్గారావు, రవిప్రకాష్ పాల్గొన్నారు.

• లింగ నిర్ధారణ నేరం



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ విశాల్‌సింగ్ ఇతర అధికారులు

మల్కన్‌గిరి: ఆస్పత్రుల్లో లింగ నిర్ధారణ చేయడం నేరమని కలెక్టర్ విశాల్ సింగ్ హెచ్చరించారు. జిల్లా రక్తదాన కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. లింగ నిర్ధారణ బయటపెడితే ఐదు సంవత్సరాల జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. జిల్లాలో ప్రస్తుతం 5 అల్ట్రాస్కాన్ క్లీనిక్‌లు ఉన్నాయని, మరో రెండు ఏర్పాటుకు దరఖాస్తుల వచ్చాయని పేర్కొన్నారు. తల్లీబిడ్డ క్షేమం కోసం స్కానింగ్ చేయాలి తప్ప, లింగ నిర్ధారణకు చేయకూడదని స్పష్టం చేశారు. లింగ నిర్ధారణ చేసినట్లు తెలిస్తే పీఎన్‌డీటీ చట్టాన్ని అమలు చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ప్రఫుల్ల కుమార్ నందో, జిల్లా మహిళ ప్రసూతి వైద్య నిపుణురాలు అనుపమ మహరణ, చిన్న పిల్లల వైద్య నిపుణురాలు ఎస్‌కే మిశ్రో తదితరులు పాల్గొన్నారు.

కొందమాల్‌లో 5టీ బృందం పర్యటన



పనులు పరిశీలిస్తున్న 5-టీ బృందం సభ్యులు

బరంపురం: కొందమాల్ జిల్లాలో 5టీ బృందం శనివారం పర్యటించింది. సీఎం నవీన్ పట్నాయక్ ప్రత్యేక కార్యదర్శి, 5–టీ బృందం కార్యదర్శి కార్తికేయ పాండ్యాన్ అధ్యక్షతన ప్రత్యేక బృందం రాష్ట్ర రాజధాని భువనేశ్వర్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో కొందమాల్ జిల్లా పుల్బాణి పట్టణానికి చేరుకున్నారు. రాష్ట్ర డిప్యూటీ కమిషనర్ సురేష్ మహాపాత్రో తదితరులు అక్కడ జరుగుతున్న పర్యాటక, మహిళా స్వశక్తికరణ అభివృద్ధి పనులు పరిశీలించారు. అనంతరం ప్రత్యేక హెలికాప్టర్‌లో భువనేశ్వర్ తిరుగు పయనమయ్యారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి



అభ్యర్థులకు సూచనలిస్తున్న పీటీసీ ప్రిన్సిపాల్ ఆనందబాబు

విజయనగరం క్రైమ్: ఆర్మీలో చేరబోయే అభ్యర్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని పీటీసీ ప్రిన్సిపాల్ టి.ఆనందబాబు పిలుపునిచ్చారు. అగ్నివీర్ పథకంలో భాగంగా ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో ఉత్తీర్ణులైన ఉమ్మడి జిల్లాకు చెందిన 40 మందికి దేహదారుఢ్య పరీక్షలకు సంబంధించి రాజీవ్ క్రీడా మైదానంలో నిర్వహించే ఉచిత రెసిడెన్షియల్ శిక్షణా శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జిల్లా వేదికగా వచ్చే నెలలో పోలీస్ శిక్షణా కళాశాల మైదానంలో నిర్వహించే పరీక్షలకు గానూ ఏర్పాటు చేసిన ఉచిత శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అభ్యర్థులకు ఉద్యోగం పొందేందుకుగానూ కావాల్సిన ప్రత్యేక మెలకువలు, సూచనలు చేసి వారిని ప్రోత్సహించారు. పీటీసీ నుంచి శిక్షణనిచ్చేందుకు ఒక ఆర్ఎస్ఐ, కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేశారు. అభ్యర్థులందరూ ఆర్మీ కొలువులు సాధించాలని ఆకాంక్షించారు.

జాతీయ కాన్ఫరెన్స్‌లో మన ఎమ్మెల్సీలు



జాతీయ స్థాయి కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్సీలు సూర్యనారాయణరాజు, రఘురాజు

విజయనగరం/నెల్లిమర్ల రూరల్: జాతీయ స్థాయిలో ముంబై వేదికగా జరిగిన కాన్ఫరెన్స్‌లో విజయనగరం జిల్లాకు చెందిన ఎమ్మెల్సీలు డాక్టర్ పివివి. సూర్యనారాయణరాజు, ఇందుకూరి రఘురాజు పాల్గొన్నారు. జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌లో మూడు రోజుల పాటు జరిగిన సదస్సులో నియోజకవర్గ అభివృద్ధి సాధనకు మెలకువలు, మార్గాలు, ప్రజలు ఆశించే స్థాయిలో సేవలందించటం, ప్రభుత్వ అధికారులకు సహకరించటం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

పట్టుబడిన బియ్యం



రేషన్ బియ్యంతో సీజ్ చేసిన ఆటో వద్ద అధికారులు

శృంగవరపుకోట : కొత్తవలస మండలంలోని ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. ముసిరాం బీసీ కాలనీ నుంచి ఆటోలో దేవరాపల్లికి బియ్యం తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో కొత్తవలస సివిల్ సప్లైస్ డిప్యూటీ తహసీల్దార్ రమేష్ తన సహచర ఉద్యోగులతో కలిసి ఆటోను అడ్డుకుని 3.20 క్వింటాళ్ల ప్రజా పంపిణీ బియ్యాన్ని సీజ్ చేశారు. బియ్యం రవాణా చేస్తున్న గాలి ఉమామహేశ్వరరావుపై 6ఏ కేసు నమోదు చేసినట్టు తెలిపారు. సీజ్ చేసిన బియ్యం కొత్తవలస ఎంఎల్ఎస్ పాయింట్‌కు అప్పగించామని వివరించారు. వీఆర్వో శ్రీనివాసరావు, మహిళా కార్యదర్శి అనూష తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ సేవలు



రిజిస్ట్రేషన్ పక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

గంట్యాడ: సచివాలయాల్లో అందుబాటులోకి వచ్చే భూముల రిజిస్ట్రేషన్ సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. గంట్యాడ మండలం నరవ గ్రామ సచివాలయంలో రిజిస్ట్రేషన్ పక్రియను కలెక్టర్ శనివారం పరిశీలించారు. గ్రామానికి చెందిన పిఠాపురం లక్ష్మి ఇంటి తనఖా రిజిస్ట్రేషన్ పక్రియను నిర్వహించారు. అనంతరం ఆమెకు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థతో ఊరిలోనే ప్రభుత్వ సేవలు అందుతున్నాయన్నారు. దేశంలో ఇప్పటి వరకు ఎక్కడాలేని విధంగా మన రాష్ట్రంలోనే ఊరూరా భూముల రిజిస్ట్రేషన్ సేవలు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. జిల్లాలో 118 సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్ సేవలు పొందవచ్చని చెప్పారు. సచివాలయాల్లో అన్ని రకాల దస్తావేజులు, వ్యవసాయ భూములు, వీలునామాలు, దత్తత మొదలైన రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని తెలిపారు. ఈసీలు కూడా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో జేసీ మయూర్ అశోక్, ఆర్డీఓ సూర్యకళ, జిల్లా రిజిస్ట్రార్ ఎ.వి.కుమారి, సబ్‌రిజిస్ట్రార్ లక్ష్మణరావు, తహసీల్దార్ ప్రసన్న రాఘవ, డిప్యూటీ తహసీల్దార్ సర్జకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

విజయనగరం క్రైమ్: రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి లక్షల రూపాయలు కాజేసిన వైనం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి వన్‌టౌన్ పోలీసులు శనివారం అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ సమీపంలో నివాసం ఉంటున్న జి.రాధికకు విద్యాశాఖలోగానీ, రెవెన్యూ శాఖలోగానీ ఉద్యోగం ఇప్పిస్తానని కంటోన్మెంట్ సీబీకాలనీకి చెందిన బర్రె కిరణ్‌కుమార్ ఆశ చూపించాడు. ఆమె నుంచి రూ. 2.40 లక్షలు తన అకౌంట్‌కి దపదఫాలుగా బదిలీ చేయించుకున్నాడు. రోజులు గడుస్తున్నా ఎటువంటి ఉద్యోగం లేకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి, రాధిక పోలీసులను ఆశ్రయించింది. వన్‌టౌన్ ఎస్ఐ ఆర్.గోపాలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు రెండో ఎంఈఓ పోస్టుల భర్తీకి కౌన్సెలింగ్

విజయనగరం ఫూల్‌బాగ్: జిల్లా వ్యాప్తంగా రెండో ఎంఈఓ ఖాళీలను బదిలీ పద్ధతిలో భర్తీ చేసేందుకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహిస్తామని డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సీనియారిటీ జాబితాను జిల్లా విద్యాశాఖాధికారి, విజయనగరం వెబ్‌సైట్‌లో పొందుపర్చామన్నారు. జాబితాలో పేరు ఉన్న మండల విద్యాశాఖాధికారులు/ప్రధానోపాధ్యాయులు ఉదయం 11 గంటలకు విజయనగరం జిల్లా పరిషత్ సమావేశ భవనంలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు.

అదుపు తప్పి కారుపై పడ్డ ట్రాక్టర్



కారు ముందు భాగంపై పడిన ట్రాక్టర్ కర్రల లోడు

గజపతినగరం : స్థానిక జాతీయ రహదారి వద్ద కర్రల లోడుతూ వెళ్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి కారుపై బోల్తా పడిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. జాతీయ రహదారిలో గోతులు ఏర్పడడంతో ట్రాక్టర్ అదుపు తప్పి రహదారి గుండా ప్రయాణిస్తున్న కారుపై పడింది. దీంతో కారు కొంత భాగం దెబ్బతింది. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణాపాయం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కారులో ఉన్న వారు సురక్షితంగా బయట పడ్డారు. విషయాన్ని తెలుసుకున్న గజపతినగరం పోలీసులు రహదారిలో బోల్తా పడిన ట్రాక్టర్‌ను పక్కకు నెట్టించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

ఇద్దరు దోపిడీ దొంగలు అరెస్టు



దోపిడీ దొంగలను అరెస్టు చేస్తున్న పోలీసులు



రికవరీ చేసిన వెండి సామగ్రి

బరంపురం: టౌన్ పోలీసుస్టేషన్ పరిధి చర్చి రోడ్డులో నివాసముంటున్న వ్యాపారి ఇంటిలో వెండి సామగ్రి దొచుకొని పరారైన ఇద్దరు దోపిడీ దొంగలను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఏఎస్పీ ఆశిస్‌కుమార్ పండా తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 11వ తేదీన టౌన్ పోలీసుస్టేషన్ పరిధి మీనాక్షి అస్పత్రి దగ్గర చర్చి రోడ్‌లో నివాసముంటున్న వ్యాపారి సురేంద్ర కుమార్ పాణిగ్రాహి ఇంటిలోకి దుండగులు చొరబడి విలువైన వెండి సామగ్రి దొచుకొని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని, సీసీ కెమేరా ద్వారా నిందితులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 3 కిలోల 425 గ్రాముల వెండి సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైనవారిలో జిల్లాలోని అస్కాకి చెందిన డి.గాంధీ, ఎం.దిలీప్‌లు ఉన్నట్లు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న సామగ్రిని బాధితుడికి పోలీసులు అప్పగించారు.



బాధితుడికి సామగ్రి అప్పగిస్తున్న పోలీసులు

అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత



కలపతో పట్టుబడిన నిందితుడు దురువ

జయపురం: జయపురం అటవీ సిబ్బంది పెట్రోలింగ్ జరుపుతున్న సమయంలో అక్రమంగా కలప తరలిస్తున్న వ్యాపారిని అరెస్టు చేసినట్లు అధికారులు తెలియజేశారు. శుక్రవారం రాత్రి సచ్చిదానంద పొరిడ నేతృత్వంలో పంపుణీ, కలియగాం, ఘతభగర్ మొదలగు ప్రాంతాల్లో పెట్రోలింగ్ జరుపుతుండగా ఘతభగర గ్రామ సమీపంలో కుంద్ర నుంచి జయపురం వైపు మూడు ద్విచక్ర వాహనాలపై కలప తరలిస్తూ కనిపించారని వెల్లడించారు. వెంటనే వారిని పట్టుకునేందుకు వెళ్లగా బైక్‌లు విడిచి పెట్టి పరారయ్యారని, అయితే పెట్రోలింగ్ టీమ్ ఒకడిని అరెస్టు చేయగలిగిందని వెల్లడించారు. అతడితో కలిసి కలప అక్రమంగా రవాణా చేస్తున్న మరో ఐదుగురు పరారైనట్లు పేర్కొన్నారు. అరెస్టైన వ్యక్తి కుంద్రా సమితి పకనగుడ గ్రామం దామోధర దురువ అని వెల్లడించారు. పట్టుబడిన కలప విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని వెల్లడించారు. పారిపోయిన వారిని త్వరలోనే పట్టుకుంటామన్నారు. పెట్రోలింగ్ టీమ్‌లో ఘతభగర రేంజర్ సునీల్ మహంతి, రంజిత నాయిక్, అరుణ జెన, ఫారెస్టు గార్డ్ అనిల్ దాస్, గౌతమ స్వైయ్, కల్పణ నాయిక్ తదితరులు ఉన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

• రూ.92వేల నగదు సీజ్, 9 మంది జూదరుల అరెస్ట్



పేకాటలో దొరికిన నిందితులతో ఎస్ఐ నారాయణరావు, పోలీస్ సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పారసాం సమీపంలో పేకాట శిబిరంపై పోలీసులు శుక్రవారం రాత్రి దాడి చేసి 9 మంది పేకాటరాయళ్లను అరెస్ట్ చేసి అధిక మొత్తంలో నగదు సీజ్ చేశారు. ఎస్ఐ పిసిని నారాయణరావు శనివారం అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. పారసాం పరిసర ప్రాంతాల్లో పేకాట శిబిరం నడుస్తున్నట్లు ముందస్తు సమాచారం రావడంతో తమ సిబ్బందితో కలిసి రాత్రి సమయంలో రెక్కీ నిర్వహించామని చెప్పారు. గ్రామ శివారులో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నామని, వారి నుంచి రూ.92,280 నగదు స్వాధీనం చేసుకొని సీజ్ చేశామన్నారు. తొమ్మిది మందిపై కేసులు నమోదు చేసి తదుపరి చర్యలు నిమిత్తం కోర్టుకు అప్పగించామని వెల్లడించారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా:

పారసాం, చంద్రంపేట, ఎల్ఎస్ పురం, టెక్కలి పరిసర ప్రాంతాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. రహదారి నిర్మానుష్యంగా ఉండడంతో తరుచూ సమీప లే అవుట్‌లతో పాటు పరిసర ప్రాంతాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. పోలీసులు పూర్తి స్థాయిలో నిఘా పెట్టి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

అప్పుల బాధతో ఆత్మహత్య

విజయనగరం క్రైమ్: అప్పుల బాధలు తాళలేక ఓ వ్యక్తి పురుగుల మందు సేవించాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. దీనికి సంబంధించి వన్‌టౌన్ పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక కంటోన్మెంట్‌లో నివాసం ఉంటున్న చెన్నా శంకరరావు(30) అప్పుల బాధ తాళలేక, బొగ్గులదిబ్బ సమీపంలో ఉన్న చెట్టు కింద ఈ నెల 15న పురుగుల మందు సేవించాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని కేంద్రాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్ఐ గోపాలరావు తెలిపారు.

మహిళా పోలీసులు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: మహిళా పోలీసులు అన్ని రంగాల్లోనూ రాణించే విధంగా శిక్షణ తీసుకోవాలని ఎస్పీ ఎం.దీపిక పేర్కొన్నారు. ఇంటిలిజెన్స్, స్పెషల్ సెక్యూరిటీ గ్రూప్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటూ పీటీసీలో నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిధిగా శనివారం హాజరయ్యారు. శిక్షణ తీసుకున్న వారంతా తెలివి తేటలతో, ఆలోచనలతో అధికారుల మెప్పు పొందాలన్నారు. పీటీసీ ప్రిన్సిపల్ టి.ఆనందబాబు మాట్లాడుతూ ప్రతి జిల్లా నుంచి 8 మంది చొప్పున మొత్తం 52 మంది మహిళా సిబ్బంది వివిధ ర్యాంకుల్లో ఈ శిక్షణకు హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌జీ డిప్యూటీ డైరెక్టర్ డి.ఆశీర్వాదం, పీటీసీ వైస్ ప్రిన్సిపాల్ పివి.అప్పారావు, డీఎస్పీలు వివి.అప్పారావు, సిహెచ్‌వి.రామారావు, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళలను వేధిస్తే కఠిన చర్యలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: మహిళలను వేధించ కూడదని, అలాంటి కేసుల్లో చట్టాలు కఠినంగా ఉంటాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. జిల్లా కోర్టులో శనివారం సమావేశం నిర్వహించారు. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం 2013పై జిల్లా కోర్టులోని మహిళా ఉద్యోగులకు అవగాహన కల్పించారు. మహిళా ఉద్యోగులు తమపై జరిగిన వేధింపులపై ఫిర్యాదు చేయాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. లైంగిక వేధింపుల నిరోధక చట్టం 2013ను కచ్చితంగా అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రైవేటు కాలేజీల్లో మౌలిక వసతులు తప్పనిసరి

నరసన్నపేట: ప్రైవేటు కాలేజీల్లో మౌలిక వసతులు ఉండాలని, అప్పుడే అనుమతులు ఇస్తామని ఆర్‌ఐఓ పి.దుర్గారావు అన్నారు. నరసన్నపేటలోని జ్ఞానజ్యోతి, శాంతా జూనియర్ కళాశాలలను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 76 ప్రైవేటు జూనియర్ కళాశాలలు ఉన్నాయని, అందరూ తరగతుల నిర్వహణకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి అనుమతులు పొందుతారని అన్నారు. నిబంధనల మేరకు మౌలిక వసతులు ఉండాలని, నెలాఖరుకు తమ తనిఖీల నివేదికలు పైకి పంపిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా తనిఖీలు చేస్తున్నామన్నారు. ఆయన వెంట కమిటీ సభ్యులు తవిటినాయుడు, నారాయణ స్వామిలు ఉన్నారు.

21న అంతర్జాతీయ యోగా దినోత్సవం

శ్రీకాకుళం పాతబస్టాండ్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఈ నెల 21న నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి పి.మురళీకృష్ణ వెల్లడించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఉదయం 6 నుంచి 8 గంటల వరకు ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో యోగా శిక్షణ కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. కార్యక్రమంలో నగరంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు, వైద్య ఆరోగ్య శాఖ, పారా మెడికల్ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు పాల్గొననున్నట్లు చెప్పారు. యోగా శిక్షణ కేంద్రాల వారు కూడా ఇందులో పాల్గొని యోగా వల్ల కలిగే ఉపయోగాలు గురించి వివరిస్తూ, యోగాసనాలు వేయిస్తారని పేర్కొన్నారు. ఈ ఏడాది వసుధైక కుటుంబం నినాదంతో యోగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డీఆర్‌ఓ తెలిపారు. సమావేశంలో ఆయుష్ సీనియర్ వైద్యాధికారి డాక్టర్ పి.జగదీష్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ బి.మీనాక్షి, మెప్మా పథక సంచాలకులు ఎం.కిరణ్ కుమార్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి, ప్రజారోగ్య అధికారి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

మెళియాపుట్టి: గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం.. అసోం రాష్ట్రం ఉదయగిరి జిల్లా దలకటి గ్రామానికి చెందిన సంజిత్ చత్రి(40) మరో ఏడుగురితో కలిసి నాలుగు రోజుల క్రితం మెళియాపుట్టి మండలం దీనబంధుపురం గ్రామ సమీపంలో ఉన్న శ్యామ్ గ్రానైట్ ఫ్యాక్టరీకి పనిచేయడానికి వచ్చాడు. శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో తలనొప్పి వస్తుందని తోటి కూలీలతో చెప్పాడు. గదికి వెళ్లి విశ్రాంతి తీసుకోవాలని పంపించేసి మిగిలిన వారు పనిచేసుకున్నారు. పని ముగించుకుని గదికి వచ్చేసరికి చత్రి కనిపించకపోవడంతో వెతికారు. చీకటి పడటంతో ఆచూకీ తెలియలేదు. శనివారం మధ్యాహ్నం ఫ్యాక్టరీకి 300 మీటర్ల దూరంలో చటిత్రి మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి ఎస్‌ఐ చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

'జాగ్రత్తలు తీసుకోవాల్సిందే'



తీరంలో మత్స్యకారులకు శిక్షణ ఇస్తున్న శిక్షకులు

వజ్రపుకొత్తూరు: సముద్రంలో చేపల వేట సాగించే మత్స్యకారులు అత్యవసర పరిస్థితుల్లో తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా తమ ప్రాణాలను రక్షించుకోవడంతో పాటు పాటు ఇతరుల ప్రాణాలను కాపాడవచ్చునని శిక్షణ డైరెక్టర్ భరత్ అన్నారు. మండలంలోని దేవునల్తాడ గ్రామంలో శనివారం మత్స్యశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని మత్స్యకారులకు బేసిక్ లైఫ్ సపోర్టు (బీఎల్‌ఎస్) అంశంపై నైపుణ్యాభివృద్ధి శాఖ అధికారులు శిక్షణ ఇచ్చారు. దేవునల్తాడ ఆర్బీకే వద్ద 25 మంది మత్స్యకారులకు నేషనల్ ఫిషరీస్ డవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌ఎఫ్‌డీబీ)ఆర్థిక ప్రోత్సాహంతో ఈ శిక్షణ ఇచ్చారు. శిక్షణలో పాల్గొన్నవారికి ఆస్ట్రేలియన్ లైఫ్ సేవింగ్ అకాడమీ సర్టిఫికెట్లను జారీ చేసినట్లు ఆయన తెలిపారు. అలాగే రోజుకు రూ.300 చొప్పున వారి బ్యాంక్ ఖాతాలో జమ చేస్తున్నట్లు మత్స్యశాఖ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వరదరాజులు, ఎంపీటీసీ సభ్యుడు ఎస్. వెంకన్న, సీనియర్ ట్రైనర్ బాలు, వి.కొండలరావు, వీఏఫ్‌ఏలు, సాగర మిత్రలు, మత్స్యకార సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సాధకులకు సత్కారం



- టెన్త్, ఇంటర్ టాపర్లకు ప్రభుత్వం ఘన సన్మానం
- చదువుకు పేదరికం అడ్డు కాదు: స్పీకర్ తమ్మినేని
- విద్య, వైద్య రంగాలకు పెద్దపీట: మంత్రి సీదిరి



టెన్త్ టాపర్లతో స్పీకర్ తమ్మినేని, మంత్రి సీదిరి, ఎమ్మెల్యే రెడ్డి శాంతి, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఇతర అధికారులు

శ్రీకాకుళం న్యూకాలనీ:

ఉత్సాహవంతులకు కావాల్సినంత ప్రోత్సాహం లభించింది. సమర్థులకు సరైన సమయంలో సాయం దొరికింది. కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా మార్కులు సాధించి వీధి బడుల విధిరాతను మార్చిన విజేతలను ప్రభుత్వం మనసారా సత్కరించింది. ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన కార్యసాధకులను ఇష్టంగా గుండెకు హత్తుకుంది. ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో చదివి టాపర్లుగా నిలిచిన వారిని శనివారం సర్కారు సన్మానించింది. 'జగనన్న ఆణిముత్యాలు' పేరిట వీరిని జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలోని కోడిరామ్మూర్తి స్టేడియం దరిలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళావేదికలో అభినందించారు. వివిధ ప్రభుత్వ మేనేజ్‌మెంట్లలో చదివిన 29 (ప్రథమ 10, ద్వితీయ 9, తృతీయ 10) మంది టెన్త్ టాపర్లను, అలాగే ఇంటర్మీడియెట్‌లో మేనేజ్‌మెంట్, గ్రూపుల వారీగా టాపర్లుగా నిలిచిన 18 మందికి సత్కరించి, నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందజేశారు. టెన్త్‌లో జిల్లాస్థాయిలో మొదటి మూడుస్థానాలకు వరుసగా రూ.50వేలు, రూ.30వేలు, రూ.15వేలు, ఇంటర్మీడియెట్ టాపర్లకు గ్రూపుకు ఒకరికి చొప్పున రూ.50వేలు అందజేశారు. ఈ లెక్కన జగనన్న ఆణిముత్యాల జిల్లా టాపర్లకు రూ.18.20లక్షల నగదు బహుమతులు పంపిణీ చేశారు.

తలరాత మార్చేది చదువే: స్పీకర్ తమ్మినేని



కార్యక్రమంలో పాల్గొన్న తమ్మినేని సీతారాం మాట్లాడుతూ పేదల తలరాత మార్చేది చదువు ఒక్కటేనని అన్నారు. చదువుకు పేదరికం ఇక అడ్డు ఉండకుండా సీఎం వైఎస్ జగన్ చర్యలు తీసుకున్నారని ప్రశంసించారు. ప్రపంచంతో మన రాష్ట్ర, జిల్లా విద్యార్థులు పోటీపడాలని భావించి సీబీఎస్‌సీ సిలబస్‌లు, ఇంగ్లిష్ మీడియంలో విద్య, బైజూస్ కంటెంట్‌తో బోధన, ఉచిత ట్యాబ్‌ల పంపిణీ, జాతీయ విద్యావిధానాన్ని పక్కాగా అమలు చేయడం వంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు.

తోటి విద్యార్థులకు స్ఫూర్తిదాయకం: మంత్రి సీదిరి



రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ విద్యార్థులు తమ జీవితంలో ఎదిగేందుకు 'జగనన్న ఆణిముత్యాలు' స్ఫూర్తిదాయకంగా నిలుస్తారని అన్నారు. పేదలకు ఉచితంగా అందించాల్సిన విద్య, వైద్య రంగాలను గత ప్రభుత్వాలు పూర్తిగా విస్మరించాయని, ఈ ప్రభుత్వంలో మాత్రం వాటికే పెద్దపీట వేశారని తెలిపారు. జిల్లా విద్యార్థులు అన్ని పరీక్షల్లోనూ అదరగొడుతున్నారని మెచ్చుకున్నారు. ఇలాంటి ఘనతను సాధించిన జిల్లా అంటే రాష్ట్ర ముఖ్యమంత్రికి కూడా మమకారం ఎక్కువని అన్నారు.

దేశం మనవైపే చూస్తోంది: ఎమ్మెల్యే రెడ్డి శాంతి



పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి మాట్లాడుతూ విద్య, వైద్య రంగాల్లో ముఖ్యమంత్రి జగన్ తీసుకొచ్చిన బృహత్తరమైన కార్యక్రమాలు, పథకాలతో అద్భుతమైన ఫలితాలు సాధ్యపడుతున్నాయన్నారు. దేశం మొత్తం ఏపీ వైపు చూస్తోందని అన్నారు.

విద్యా వ్యవస్థలో సమూల మార్పులు: కలెక్టర్

కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ జగనన్న ఆణిముత్యాల పేరిట నాలుగు దశలుగా విద్యార్థులకు సత్కారాలు చేశామన్నారు. ఈ నెల 20న విజయవాడలో సీఎం జగన్ చేతులమీదుగా రాష్ట్రస్థాయి టాపర్లకు సన్మానాలు ఉంటాయన్నారు. విద్యావ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టి ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చుతున్న సీఎం జగన్ చరిత్రలో నిలిచిపోతారని తెలిపారు. కార్యక్రమంలో ముందుగా నృత్య శిక్షకులు నీరజసుబ్రహ్మణ్యం శిష్య బృందం చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియెట్ విద్య జిల్లా అధికారి కోట ప్రకాశరావు, ఆర్‌ఐఓ ప్రగాడ దుర్గారావు, జిల్లా విద్యా శాఖాధికారి ఎస్.తిరుమల చైతన్య, సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ రోణంకి జయప్రకాష్, డిప్యూటీ డీఈఓ గార పగడాలమ్మ, అసిస్టెంట్ కమిషనర్ లియాఖత్ ఆలీఖాన్, డీసీఈబీ సెక్రటరీ ఆర్.రాజేంద్రప్రసాద్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

జీవితాంతం రుణపడి ఉంటా



మాలాంటి కుటుంబాలకు ఆర్థికంగా చేయూతను అందిస్తున్న మా జగన్ మామయ్యకు జీవితాంతం రుణపడి ఉంటాం. మాలాంటి పేద కుటుంబానికి రూ.50 వేలు ఇవ్వడం ఎంతో సాయంగా ఉంటుంది. మా ప్రిన్సిపాల్ కోట ప్రకాశరావు ఎంతగానో ప్రోత్సహించారు.

– కొర్లాపు మీనాకుమారి, ఇంటర్మీడియెట్ బైపీసీ టాపర్ (981 మార్కులు,జీజేసీ టెక్కలి)

రూపాయి ఖర్చు లేకుండా చదువు..



రూపాయి ఖర్చు లేకుండా ఈ రోజు ప్రభుత్వ బడుల్లో విద్యను అందిస్తున్న సీఎం జగన్ మామకు ఏమిచ్చినా రుణం తీరదు. అమ్మఒడి, విద్యాకానుక, నాడు–నేడు, గోరుముద్ద, రాగిమాల్ట్, చిక్కీ వంటివి అందిస్తున్నారు. గతంలో ఎప్పుడూ ఇలాంటివి పథకాలు మాకు అందలేదు.

– గొలివి ప్రేమ సఖి, ఏపీ మోడల్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ టాపర్ (584 మార్కులు,ఈదుపురవలస)



హాజరైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు

'గ్రామీణుల జీవన ప్రమాణాలు మెరుగుపడాలి'



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: సంసద్ ఆదర్శ్ గ్రామ్ యోజన (ఎస్‌ఏజీ) ద్వారా ఆదర్శ గ్రామ ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడాలని, ఆ దిశగా అధికారులు కృషి చేయాలని సంయుక్త కలెక్టర్ ఎం.నవీన్ జిల్లా అధికారులకు పిలుపునిచ్చారు. సంసద్ ఆదర్శ్ గ్రామ్ యోజన పథకం ద్వారా జిల్లాలో ఎంపికైన ఆదర్శ గ్రామాల్లో చేయాల్సిన ప్రణాళికపై జేసీ అధ్యక్షతన శనివారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రజల ఆర్థిక, సామాజిక అభివృద్ధి, సుపరిపాలన దిశగా ప్రణాళికలు వేయాలన్నారు. ఎంపీడీఓలు, ఈఓపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు కీలక భాగస్వామ్యం తీసుకోవాలన్నారు. సోంపేట మండలం ఇసకలపాలెం, పలాస మండలం గురుదాసుపురం, కొత్తూరు మండలం కుద్దిగాం, శ్రీకాకుళం మండలం నైరా, పొందూరు మండలం తండ్యాం ప్రాంతాల్లో ఈ ప్రణాళికలను అమలు చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వహణాధికారి ఆర్.వెంకటరామన్, ముఖ్య ప్రణాళికాధికారి వీఎస్‌ఎస్ లక్ష్మీ ప్రసన్న, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. మీనాక్షి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై బిందు సేద్యం పరికరాలు



ఎచ్చెర్లలో బిందుసేద్యం యూనిట్ పరిశీలిస్తున్న సూక్ష్మనీటి పారుదల పథకం ప్రాజెక్టు డైరెక్టర్ రెడ్డి శ్రీనివాసరావు

ఎచ్చెర్ల క్యాంపస్: రైతులకు రాయితీపై బిందుసేద్యం పరికరాలు అందజేయనున్నట్లు సూక్ష్మనీటి పారుదల పథకం ప్రాజెక్టు డైరెక్టర్, ఎచ్చెర్ల మండల ప్రత్యేకాధికారి రెడ్డి శ్రీనివాసరావు చెప్పారు. ఎచ్చెర్లలో బిందు సేద్యం వ్యవసాయ క్షేత్రాలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో 800 హెక్టార్లలో బిందు, తుంపర సేద్యం అమలు చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఆర్‌బీకేలు, ఉద్యాన కార్యాలయాల్లో ఆసక్తి గల రైతుల పేర్లు నమోదు చేస్తున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలకు వీహెచ్‌ఏ, వీఏఏ, వీఎస్‌ఏలను సంప్రదించాలని సూచించారు. దరఖాస్తుల స్వీకరణ అనంతరం క్షేత్రస్థాయి సిబ్బంది పరిశీలించి అంచనాలు రూపొందిస్తారని, రైతు చెల్లించాల్సిన వాటా ఫోన్‌కు మెసేజ్ వస్తుందని తెలిపారు. అనంతరం కలెక్టర్ అనుమతితో పరికరాలు అందజేస్తామని వివరించారు. రైతుల పొలాల్లో ట్రెంచ్‌లు వేసి మైక్రో ఇరిగేషన్ కంపెనీలు పరికరాలు అమర్చి వినియోగంపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ఐదు ఎకరాలలోపు రైతులకు 90 శాతం రాయితీపై రూ.2.18 లక్షల అంచనా వ్యయం మించకుండా బిందు సేద్యం పరికరాలను అందజేస్తామన్నారు. ఐదు ఎకరాలు దాటిన రైతులకు 50 శాతం రాయితీపై రూ.3.10 లక్షల అంచనా వ్యయం మించకుండా పరికరాలు అందజేస్తామని చెప్పారు. రైతులు సాగునీటి సౌకర్యం వసతి కలిగి ఉండాలని, విద్యుత్ మోటార్, డీజిల్ ఇంజిన్లు అందుబాటులో ఉండాలన్నారు. తుంపర సేద్యం పరికరాలను ఐదు ఎకరాల లోపు రైతులకు 55 శాతం రాయితీపై, ఐదేళ్లు దాటిన రైతులకు 45 శాతం రాయతీపై అందజేస్తామని వివరించారు. బిందు, తుంపర సేద్యం వల్ల నీటి నిర్వహణ తగ్గుతుందని, విద్యుత్, డీజిల్ వినియోగం తగ్గుతుందని, కలుపు నియంత్రణ సాధ్యమవుతుందని, ఎరువుల వినియోగం మెరుగ్గా ఉండటంతో పాటు, పంటలు మెరుగ్గా ఉంటాయని చెప్పారు. రైతులకు పంటల యాజమాన్య ఖర్చులు 30 నుంచి 40 శాతం తగ్గుతాయని వివరించారు. ప్రభుత్వ రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేర నిర్ధారణలో స్థల పరిశీలన కీలకం

శ్రీకాకుళం పాతబస్టాండ్: నేర నిర్ధారణలో స్థల పరిశీలన ఎంతో అవసరమని జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్, ఎస్సీ, ఎస్టీ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెట్ట మల్లేశ్వరరావు అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని ప్రాసిక్యూషన్ కార్యాలయంలో శనివారం జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరం జరిగిన స్థలానికి పీపీలు వెళ్తే కోర్టు విచారణలో ఉపయోగపడుతుందని చెప్పారు. జిల్లా కుటుంబ న్యాయస్థానం పబ్లిక్ క్యూటర్ వాన కృష్ణచంద్, సీనియర్ అదనపు పీపీలు తంగి శివప్రసాదరావు, కె.ఆఫీసునాయుడు, కె.తిరుమలరావు, పి.వి.రమణమూర్తి, సీహెచ్.శ్రీకాంత్, కె.శంకరరావు, ఉషాకిరణ్, ఉషారాణి, ఎస్సై ప్రవల్లిక పాల్గొన్నారు.

అంతుచిక్కని వ్యాధి..

అంతులేని బాధ



వ్యాధి రాక ముందు బాలుడు



వ్యాధి వచ్చిన తర్వాత..

- వింతవ్యాధితో బాధ పడుతున్న చిన్నారి
- చికిత్స కోసం డబ్బుల్లేక అల్లాడిపోతున్న తల్లిదండ్రులు
- దాతలు ఆదుకోవాలని వేడుకోలు

జి.సిగడాం:

పదేళ్ల కుర్రాడు. స్నేహితులతో చక్కగా ఆడుకుంటూ, రోజూ స్కూల్‌కు వెళ్తూ ఉత్సాహంగా ఉండేవాడు. ఏమైందో ఏమో తెలీదు. ఒకరోజు ఉన్నట్టుండి బలహీనత ఆవరించింది. కాళ్లు చేతులు కదల్లేదు. కళ్ల ముందు అల్లరిగా తిరిగిన పిల్లాడు మంచానికే పరిమితమైపోయాడు. ఆస్పత్రుల చుట్టూ తిప్పినా సమస్య ఏమిటో తెలియలేదు. సిటీకి వెళ్లి చూపిస్తే ఆపరేషన్ చేస్తే నయం అవుతుందని, కానీ రూ.25 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. వ్యవసాయ కూలీలుగా రోజులు గడుపుతున్న తల్లిదండ్రులకు ఈ ఖర్చు తలకు మించిన భారంగా మారింది. ఇప్పటికే కొడుకు వైద్యం కోసం చాలా అప్పులు చేశారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో దాతల సాయం కోరుతున్నారు. వివరాల్లోకి వెళితే..

జాడ గ్రామానికి చెందిన యాకల శంకరరావు, సీత దంపతుల కుమారుడు గణేష్. బాలుడు స్థానిక పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. ఈ ఏడాది ఏప్రిల్ 10వ తేదీ వరకు అతని జీవితం సాఫీగానే సాగింది. పిల్లాడు చక్కగా ఉండేవాడు. కానీ 10వ తేదీన మధ్యాహ్నం 3 గంటల సమయంలో గణేష్ బడిలో స్పృహ కోల్పోయాడు. చిన్నపాటి జ్వరం కూడా రావడంతో వెంటనే తల్లిదండ్రులు వైద్యుల వద్దకు తీసుకెళ్లారు. సమస్య పెద్దదిగా కనిపించడంతో వెంటనే శ్రీకాకుళం రిమ్స్, రాగోలు జెమ్స్, విజయనగరం ఆస్పత్రికి తీసుకెళ్లి పరీక్షలు చేయించారు. కానీ సమస్య తెలియకపోవడంతో విశాఖ కూడా వెళ్లారు. వ్యాధి అంతుచిక్కడం లేదని, ఆపరేషన్ చేస్తే ఫలితం ఉండొచ్చని వైద్యులు చెప్పారు. చికిత్స కోసం రూ.25 లక్షల వరకు ఖర్చవుతుందని చెప్పారు. దీంతో తల్లిదండ్రుల గుండెల్లో రాయి పడింది. అంతపెద్ద డబ్బు ఎలా ఏర్పాటు చేయాలో తెలీక వారు నరకయాతన అనుభవిస్తున్నారు. ఇప్పటికే రూ.10 లక్షల వరకు ఖర్చు చేశారు. చికిత్స కోసం డబ్బులు తీసుకురావడం తమకు సాధ్యం కావడం లేదని, దాతలే ఆదుకోవాలని కోరుతున్నారు.

సాయం చేయాలనుకునే వారు 70320 79299 నంబర్‌ను సంప్రదించాలని కోరుతున్నారు.

కూలి డబ్బు చాలడం లేదు..



మాది రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబం. గణేష్‌ను కాపాడుకునేందుకు చాలా ఇబ్బందులు పడుతున్నాం. కూలి డబ్బులు సరిపోవడం లేదు. దాతలు, అధికారులు, ప్రభుత్వం నా బిడ్డను బతికించాలి.

– సీత, బాలుడి తల్లి

అప్పులు చేశాం



నా బిడ్డ ప్రాణాలు నిలబెట్టడానికి రూ.10 లక్షల వరకు అప్పు చేశాం. కానీ ఎవరూ వ్యాధి పేరు కూడా చెప్పలేదు. ఇప్పుడు మా చేతిలో చిల్లిగవ్వలేదు. రోజురోజుకూ బాబు ఆరోగ్యం క్షీణిస్తోంది. అధికారులు, దాతలు ఆదుకోవాలి.

– శంకరరావు, బాలుడి తండ్రి

ప్రాధాన్యత కేసులపై ప్రత్యేక శ్రద్ధ



నేర సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : ప్రయారిటీ కేసులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఇన్వెస్టిగేట్ చేయాలని అధికారులను ఎస్పీ జీఆర్ రాధిక సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం జిల్లావ్యాప్తంగా ఉన్న పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, పోలీసు అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని పెండింగ్‌లో ఉన్న కేసులు పరిష్కరించే దిశగా.. తప్పు చేసిన నేరస్తులకు శిక్ష పడేలా సుమారు 520 కేసులు గుర్తించామన్నారు. సబ్ ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారుల నుంచి డీఎస్పీ స్థాయి అధికారులకు కేసుల పరిష్కారానికి అప్పగించామన్నారు. దర్యాప్తు విషయమై కీలక సూచనలు చేశారు. జాతీయ రహదారిపై నో పార్కింగ్ బోర్డులు పెట్టాలన్నారు. జగనన్నకు చెబుదాం ద్వారా వచ్చే ఫిర్యాదులపై శ్రద్ధ వహించి వాటిని పరిష్కరించాలని, రౌడీషీటర్లపై నిఘా పెట్టి వారు ఎలాంటి నేరాలకు పాల్పడకుండా కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు.

గురుకుల కార్మికులను తొలగించడం తగదు



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులాల్లో ఐదేళ్లుగా పనిచేస్తున్న స్వీపింగ్, శానిటేషన్,సెక్యూరిటీ, సూపర్‌వైజర్లను అర్ధాంతరంగా తొలగించడం తగదని శనివారం కలెక్టరేట్ కార్యాలయం వద్ద ఇఫ్టూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి డి. గణేష్ మాట్లాడుతూ ఇన్నాళ్లూ కనీస వేతనాలు ఇవ్వకపోయినా, వసతులు కల్పించకపోయినా ఎప్పటికైనా ఉద్యోగం రెగ్యులర్ అవుతుందన్న ఆశతో ఎదురుచూస్తున్న కార్మికులను విద్యార్థుల సంఖ్య బట్టి కుదించడం కార్మిక వ్యతిరేక చర్య అని పేర్కొన్నారు. తక్షణమే తొలగింపు ఆదేశాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్‌ఓ మురళీకృష్ణకు వినతపత్రం అందజేశారు. కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

పోలీసుల సేవకు పతకాలతో గుర్తింపు

- 2022, 2023లకు గాను రాష్ట్ర అవతరణ దినోత్సవం, ఉగాది సేవా పతకాలు
- నగదు పురస్కారాలు, ప్రశంసాపత్రాలు అందజేసిన ఎస్పీ రాధిక



దిశా డీఎస్పీ వాసుదేవ్‌కు సేవాపతకం అందిస్తున్న ఎస్పీ రాధిక



సేవా పతకాలు అందుకుంటున్న పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్ :

పోలీసుల సేవకు పతకాలతో గుర్తింపు లభించింది. జిల్లా పోలీసు శాఖలో ఉత్తమ సేవలందించినవారికి ఎస్పీ జి.ఆర్.రాధిక ఉత్తమ సేవా పతకాలు, నగదు పురస్కారాలు, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధుల్లో మంచి సేవలందిస్తే గుర్తింపు ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. 2022 రాష్ట్ర అవతరణ దినోత్సవం, 2023 ఉగాదికి సంబంధించి ఉత్తమ సేవాపతకాలకు ఎంపికైన దిశా డీఎస్పీ ఎస్.వాసుదేవ్, సీఐ డీవీవీ సతీష్‌కుమార్, ఎస్‌ఐ ఆర్.శంకరరావు, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ కె. శేఖరరావు, ఏఆర్ ఎస్‌ఐ ఎం.చిన్నారావు, ఆర్మ్‌డు రిజర్వ్ హెడ్ కానిస్టేబుల్ వై.నర్సింహులు, టి.రాంబాబు, కానిస్టేబుల్ ఎ.మల్లేశ్వరరావు, బి.అప్పలనాయుడులకు పతకాలు ప్రదానం చేసి అభినందించారు. ఇటీవల గొలుసు దొంగతనాలకు చెందిన 15 కేసుల్లో సకాలంలో నేరస్తులను పట్టుకోవడం, ప్రాపర్టీ రికవరీ చేయడంలో ప్రతిభ కనబర్చిన టెక్కలి సీఐ ఎస్.సూర్యచంద్రమౌళి, సీసీఎస్ ఎస్‌ఐ హరికృష్ణ, మహ్మద్ ఆలీ, హెడ్ కానిస్టేబుల్ కె.మోహన్‌దత్, వెంకట్ సత్యం, ఎం.శ్రీధర్ కుమార్, కానిస్టేబుల్ ఎ.త్రినాథరావు, వి.భూలోకేష్ రావు, బి.లోకనాథం, డి.ఉమామహేష్‌రావులకు నగదు రివార్డులు అందజేశారు.

మహిళా పోలీసులకు జ్ఞాపికలు..

జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీసులు దిశాయాప్ డౌన్‌లోడ్, అసాంఘిక కార్యకలాపాలపై ముందస్తు సమాచారం, గ్రామస్థాయిలో మహిళలకు అవగాహన, చైతన్యాన్ని తీసుకొచ్చి వివిధ అంశాలపై చక్కని విధులు కనబర్చిన ఎం.శిరీష, శోభన భగు, యు.ఐశ్వర్య, టి.త్రివేణి, ఎస్.గీతప్రియ, మెట్ట జయలక్ష్మి, సీహెచ్ ఆశాలత, ముద్దాడ నాగమణి, ముద్దాడ షణ్ముఖి, చింతపల్లి శిరీష, వైశ్యరాజు స్వాతి, జి.దివ్య, ఎం.శ్రావణి, ధనలక్ష్మి, బొమ్మాళి ఝాన్సీ, డి.లావణ్య, బి.కాశీప్రసన్న, నవుగాన అనూష, లంకా వాసంతి, పతి హైమావతి, పీసా హేమలత, ఎస్.సంధ్య, భానుమతిలకు జ్ఞాపికలు అందజేశారు.

ప్రతిభకు గుర్తింపు

దిశాయాప్ డౌన్‌లోడ్, రహదారి ప్రమాదాల నివారణ, శాంతి భద్రతల పరిరక్షణ, డ్రంక్ అండ్ డ్రైవ్ చేసేవారిని తనిఖీ చేసి జరిమానా విధించడంలో ప్రతిభ చూపిన కాశీబుగ్గ సీఐ శ్రీనివాసరావు, ఒకటో పట్టణ, శ్రీకాకుళం రూరల్, ఆమదాలవలస, లావేరు, టెక్కలి, కోటబొమ్మాళి, నందిగాం, బారువ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐలు బలివాడ గణేష్; విజయ్‌కుమార్, కృష్ణ, కోటేశ్వర్రావు, రామకృష్ణ, మహ్మద్ ఆలీ, అహ్మద్ ఆలీ, చిరంజీవిలకు ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. విధి నిర్వహణలో అందించిన సేవలను ప్రశంసించారు.